క్లుప్తంగా

తల్లిదండ్రులకు పాదపూజ



తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్: మండల పరిధిలోని రాయికల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సువర్ణ మాట్లాడుతూ.. కనిపించని ఆ దైవం కంటే కనిపించే తల్లిదండ్రులు మిన్న అని అన్నారు. తల్లిదండ్రులు దేవుళ్లతో సమానమని, జన్మనిచ్చిన వారికి పాదాలకు పూజ చేయడం ద్వారా ఎంతో పుణ్యం లభిస్తుందని చెప్పారు. చిన్నారులకు మొదటి గురువు తల్లేనని తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో జ్ఞాపకశక్తిని పెంపొందించే శిక్షణా శిబిరాలకు వెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థుల ఆసక్తిని గుర్తించి వారికి ఇష్టమైన రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీపై అవగాహన



గొర్రెల కాపరులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యురాలు

కొత్తూరు: రెండో విడత గొర్రెల పంపిణీపై మండలంలోని కొడిచర్లలో సోమవారం మండల పశువైద్యురాలు స్ఫూర్తి పెంపకందారులకు అవగాహన కల్పించారు. గొర్రెల పంపిణీలో యూనిట్ల వారీగా ప్రభుత్వం లబ్ధిదారులకు ఇస్తున్న సబ్సిడీ.. చెల్లించాల్సిన నగదు మొత్తాల గురించి ఆమె తెలియజేశారు. అంతేకాకుండా గొర్రెల సేకరణలో ఉండే అంశాలు.. కాపరులు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, నాయకులు జంగయ్య, శ్రీనివాస్, గొర్రె కాపరుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్వామి వారి సేవలో ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

అనంతగిరి: వికారాబాద్ అనంతగిరిగుట్ట అనంతపద్మనాభ స్వామిని సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య దంపతులు తమ పెళ్లిరోజు సందర్భంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

కంటి పరీక్షలు చేయించుకోండి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొందుర్గు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ భూపాలచారి సూచించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపాలచారి మాట్లాడుతూ.. కంటిచూపు లేకుంటే ప్రపంచమే శూన్యమని, నేత్రాలను కాపాడుకోవాలని తెలిపారు. ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని అమలు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ, సిబ్బంది అశ్వాక్, నరేష్, మంజుల, అరుణ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సీపీఆర్‌పై అవగాహన

కొందుర్గు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు సీపీఆర్ విధానంపై అవగాహన కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరికైనా అనుకోకుండా గుండెనొప్పి వస్తే సీపీఆర్ విధానం ద్వారా ఎలా రక్షించవచ్చు అనే విషయమై అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయిలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

అకాల వర్షం.. అపార నష్టం

- దెబ్బతిన్న కూరగాయలు, పూల తోటలు, కోళ్లఫామ్‌లు
- మద్దూరు పౌల్ట్రీఫాంలో మృత్యువాత పడ్డ రెండు వేల కోడి పిల్లలు



పౌల్ట్రీ ఫామ్‌లో చనిపోయిన కోడి పిల్లలు

షాబాద్: అకాల వర్షాలు రైతులకు కడగండ్లు మిగిల్చాయి. గత మూడు రోజులుగా ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వర్షాలకు చేతికి వచ్చిన పంటలు దెబ్బతిని రైతులు బాగా నష్టపోయారు. వందల ఎకరాల్లో పంటలు నష్టం జరిగిందన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో వసీస్ జిలాని పౌల్ట్రీఫామ్‌లో వడగళ్ల ధాటికి సుమారు 2వేల కోడి పిల్లలు మృతి చెందాయి. రూ. 2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తిర్మలాపూర్ గ్రామంలో గత రెండు రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షానికి పిడుగు పడి పాడి ఆవు మృతి చెందింది. అలాగే హైతాబాద్, మద్దూరు, అంతిరెడ్డిగూడ, మాచన్‌పల్లి, చిన్న సోలీపేట్, పెద్ద సోలీపేట్ గ్రామాల్లో సాగు చేసిన కూరగాయలు, పువ్వులు, వరి, తదితర పంటలు సైతం తీవ్రంగా నష్టపోయాయి. నష్టపోయిన పంటలకు, పౌల్ట్రీ ఫామ్, రైతులకు, పశువులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



మంజులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: ఉద్యోగం రాలేదని నిరుత్సాహ పడకుండా తమకు నచ్చిన రంగంలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీహరి యాదవ్‌లు అన్నారు. సోమవారం మండలంలోని హిమాయత్‌నగర్‌లో నిరుద్యోగ యువకుడు కట్టమీది శ్రీనివాస్ వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వారు పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్య వివాహ వార్షికోత్సవం ఉండడంతో గ్రామ సర్పంచ్ మంజుల సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్వయం ఉపాధిలో యువత ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ తమ కుటుంబాన్ని పోషించుకోవాలని తెలిపారు. వాటర్ ఫిల్టర్‌తో ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంజుల, ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీహరియాదవ్, ప్రకాష్, మహేందర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, రాజు, ముదిగొండ రాఘవేందర్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యాలయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఎంపీటీసీ లావణ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే విద్యాలయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్లలో ఎంపీటీసీ లావణ్యఅశోక్‌రెడ్డి దంపతుల సహకారంతో కీర్తిశేషులు వడ్యాల యాదమ్మ, లక్ష్మారెడ్డిల జ్ఞాపకార్థం రూ.3లక్షల సొంత నిధులతో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన షెడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంఈఓ శంకర్ రాథోడ్‌లు మాట్లాడుతూ.. నేటి బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యతో పేదరికాన్ని నిర్మూలించవచ్చని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల రూపురేఖలను మార్చుతూ విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో 22 కేంద్రాల్లో పరీక్షలు

కేశంపేట: ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ సత్యానారాయణ తెలిపారు. జిల్లాలో 22 కేంద్రాల్లో ఓపెన్ పదవ తరగతిలో 2522 మంది, ఇంటర్మీడియట్‌లో 3222 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, మళ్లీ 2.30గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలను నిర్వహించడం జరుగుందని ఆయన పేర్కొన్నారు.

ఉపాధి పనులకు సర్పంచ్



కంపచెట్లను తొలగిస్తున్న సర్పంచ్ రేణుక

కేశంపేట: గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక వడ్డీలు చెల్లించే స్తోమత లేక సర్పంచ్ ఉపాధి హామీ పనులకు వెళ్తుంది. మండలంలోని సంగెం సర్పంచ్ రేణుక అండర్ డ్రైనేజీ పనులను అప్పులు చేసి చేపట్టింది. పనులు జరిగి నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో వడ్డీలు చెల్లిస్తున్నట్లు ఆమె తెలిపారు. గత మూడు రోజులుగా గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన కంపచెట్ల తొలగింపు పనులకు వెళ్తున్నట్లు ఆమె తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

కొత్తూరు: నందిగామ మండలంలోని జంగోనిగూడకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లోకి రావడం సంతోషకరమన్నారు. రాష్ట్ర విభజనకు ముందు అన్ని రంగాల్లో వెనకబడిన తెలంగాణను సీఎం కేసీఆర్ తన పాలనతో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా అభివృద్ధి చేసినట్లు వివరించారు. దేశంలోని పలు రాష్ట్రాల ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు కుమార్‌గౌడ్, పార్టీలో చేరిన వారు బాల్‌రాజుయాదవ్, యాదయ్య, శేఖర్, రవి, నర్సింహా, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో దృష్టి సమస్యలకు చెక్

ఎంపీడీఓ వెంకయ్యగౌడ్



కంటి వెలుగును ప్రారంభించిన ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, సర్పంచ్ సుమిత్ర

శంకర్‌పల్లి: కంటి వెలుగును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మోకిల గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పేద ప్రజలకు కంటి వెలుగు కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వృద్ధులకు ఎంతో మేలును చేకూరుస్తుందన్నారు. విద్యార్థులు కూడా కంటి పరీక్షలు చేయించుకొని దృష్టి సమస్యల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని సూచించారు. వైద్య సిబ్బంది రోగులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టంగటూరు ఆరోగ్య కేంద్రం డాక్టర్ సత్యజ్యోతి, గ్రామ సర్పంచ్ సుమిత్ర, ఉప సర్పంచ్ రాజు, ఎంపీఓ గీత, కార్యదర్శి లక్ష్మీతులసి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొంగ్ర సత్యం, నాయకులు మోహన్‌రెడ్డి, శేఖర్, విఠల్, వైద్య సిబ్బంది ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పలకల పంపిణీ



పలకలను పంపిణీ చేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: విశ్రాంత ఎస్పీ పద్మాకర్‌రావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సోమవారం చిన్నారులకు పలకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ నాగమణి, కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్ హాజరై చిన్నారులకు పలకలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉద్యోగ రీత్యా విదేశాలలో స్థిరపడినప్పటికీ తమ వారి జ్ఞాపకార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని అన్నారు. ప్రతి సంవత్సరం అంగన్‌వాడీ కేంద్రానికి ఏదో ఒక రూపంలో సహకారం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాండురంగారెడ్డి, బీఆర్‌ఎస్ 4వ వార్డు మహిళా అధ్యక్షురాలు ఉమాదేవి, ఇస్నగారి బాలాజీ, రాములునాయక్, వినోద్‌నాయక్, ఖాలేద్‌ఖాన్, ప్రమీల పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు తొత్తులుగా అధికారులు



వాల్‌పోస్టర్లను తొలగిస్తున్న అధికారులు

- ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్ల తొలగింపుపై బీజేపీ నాయకుల ఆగ్రహం

చేవెళ్ల: బీఆర్‌ఎస్ పార్టీకి అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అధికారుల తీరుపై బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పత్తి సత్యనారాయణలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని మీర్జాగూడ, ముడిమ్యాల, పామెన గ్రామాల్లో అమిత్‌షా సభకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, వాల్‌పోస్టర్లను గ్రామ పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో తొలగించారు. ఈ విషయం తెలిసిన బీజేపీ మండల నాయకులు ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నిస్తే పంచాయతీ కార్యదర్శులు తమకు పైనుంచి ఆర్డర్ వచ్చిందని చెబుతున్నారు. దీనిపై వారు ఎంపీడీఓ రాజ్‌కుమార్‌ను, డీఎల్‌పీఓ శ్రీకాంత్‌రెడ్డిలను అడగ్గ తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని కార్యదర్శులను అడిగి తెలుసుకుంటామని చెప్పారని తెలిపారు. బీజేపీ బలోపేతాన్ని చూసి ఓర్వలేక ఇలా చేయిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణామోహన్, చంద్రశేఖర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యం

- వేసవి సెలవులను వృథా చేయొద్దు
- ఎంఈఓ శంకర్‌రాథోడ్

షాద్‌నగర్‌రూరల్: ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎంఈఓ శంకర్‌రాథోడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి విద్య ఎంతో అవసరమన్నారు. చిన్నారులు పాఠశాల స్థాయిలో చదువు మానేయకుండా ఉన్నత చదువులను అభ్యసించాలని తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా మీకు నచ్చిన రంగాలలో తర్ఫీదు తీసుకోవాలని చెప్పారు. కంప్యూటర్, డ్రాయింగ్, నృత్య శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్, యుద్ధవిద్యలు లాంటివి నేర్చుకోవాలని సూచించారు. చిన్నారులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీకాంత్, టీచర్లు శ్రీదేవి, అరుణ, వందన, జ్యోతిలక్ష్మి, గీతమ్మ, బుగ్గమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప బోనాలు

షాబాద్: శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, బ్యాండు, డప్పుల చప్పుళ్ల మధ్య మండలంలోని అప్పారెడ్డిగూడలో సోమవారం ఘనంగా బీరప్ప బోనాల ఉత్సవాలు జరిగాయి. గ్రామస్తులంతా ఉదయం గంపలను నెత్తిన పెట్టుకుని దేవాలయానికి చేరుకున్నారు. అక్కడ ఓ వైపు మల్లన్న, భ్రమరాంభ అమ్మవార్ల కల్యాణం జరుగుతుండగానే మరో వైపు బోనాలను సిద్ధం చేశారు. ప్రదక్షిణల అనంతరం స్వామివారికి బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, సర్పంచ్ పూజిత, ఎంపీటీసీ సరళ, గ్రామస్తులు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మాయావతి సభను విజయవంతం చేద్దాం

కొందుర్గు: బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మే 7వ తేదీన నిర్వహించే సభను విజయవంతం చేద్దామని బహుజన సమాజ్ పార్టీ మండలాధ్యక్షుడు దుర్గని శ్రీను సూచించారు. సోమవారం కొందుర్గు మండలంలోని టేకులపల్లి గ్రామంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు అన్ని గ్రామాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

నడి రోడ్డుపై మురుగు ప్రవాహం

కొందుర్గు: మండల కేంద్రంలోని వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తున్న ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో మురుగునీరు రోడ్డుపై నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కనీసం కాలినడకకు కూడా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వీధుల్లో నిలిచిన మురుగునీరు

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయండి

బీజేపీ నేత నర్సింహయాదవ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సింహయాదవ్

కేశంపేట: నేడు పాలమూరులో నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహయాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నీళ్లు, నియామకాలు, నిధుల నినాదంతో ఏర్పడిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియామకాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఇంటికి ఒక్క ఉద్యోగం వస్తుందని ఆశపడిన నిరుద్యోగులకు నిరాశే ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ మార్చ్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం నిరుద్యోగ మార్చ్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రొల్లు రఘురాములు గౌడ్, కంచుకోట మణికంఠ, గోపాల్‌రెడ్డి, కృష్ణ, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నేడు(మంగళవారం)బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ చేపట్టిన నిరుద్యోగ మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్‌గుప్త సోమవారం ఒకప్రకటనలో కోరారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసిన 30లక్షల మంది నిరుద్యోగులకు లక్ష చొప్పున ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

బీజేపీ పార్లమెంట్ ప్రభారీ చంద్రశేఖర్



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ప్రభారీ చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని బీఏఎం, విజ్ఞాన్ డిగ్రీ తదితర కళాశాలల్లో సోమవారం బీజేవైఎం రాష్ట్ర నాయకుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిరుద్యోగ మార్చ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో బీఆర్‌ఎస్ పార్టీ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఎన్నో ఏళ్లుగా నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారని అన్నారు. అయితే, ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేయడంతో నిరుద్యోగులు ఎంతో శ్రమకోర్చి, డబ్బులు వెచ్చించి శిక్షణ తీసుకున్నారని చెప్పారు. పరీక్ష పత్రం లీక్ కావడంతో విద్యార్థుల శ్రమంతా వృథా అయిందన్నారు. ప్రభుత్వం పరీక్షలకు సిద్ధమైన విద్యార్థులకు లక్ష రూపాయలు చెల్లించాలన్నారు. పేపర్ లీకేజీ ఘటనపై మంత్రి కేటీఆర్‌ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, అందెబాబయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, నర్సింహ్మగౌడ్, అశోక్, మోహన్‌సింగ్, వెంకటేశ్, అగ్గి ప్రవీణ్, అఖిల్, శ్రీను, రవినాయక్, వివేక్, అభి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లకు 20 మంది లబ్ధిదారుల ఎంపిక



ఎంపికైన లబ్ధిదారులతో అధికారులు

శంకర్‌పల్లి: మండలంలోని జనవాడ, మిర్జాగూడ గ్రామాల్లో 40మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయి. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ నయిముద్దీన్ సమక్షంలో ఆయా గ్రామాలకు చెందిన 20మందిని డ్రా ద్వారా ఎంపిక చేశారు. కాగా, మిగతా ఇరవై మందిని మళ్లీ డ్రా ద్వారా ప్రకటించడం జరుగుతుందని తహసీల్దార్ నయిముద్దీన్ పేర్కొన్నారు. 20ఇళ్ల నిర్మాణం పూర్తయినందున 20మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. మిగతా ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే వారికి కూడా ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ, మిర్జాగూడ సర్పంచ్ రవీందర్‌గౌడ,జనవాడ ఎంపీటీసీ నాగేం, నాయకులు కిషన్ సింగ్, గౌడిచర్ల నర్సింహా, మోత్కుపల్లి అశోక్, సురేందర్‌రెడ్డి తదితలరు పాల్గొన్నారు.